



• నవీపేటలో దర్శనమిచ్చిన ఆరుద్ర పురుగులు

ఆరుద్ర పురుగులు వచ్చేశాయి



నవీపేట: ఎర్రగా.. బొద్దుగా.. చక్కటి రంగులో మెరిసిపోయే ఆరుద్ర పురుగులు రానేవచ్చేశాయి. తొలకరి వానలతో బీడు భూముల నుంచి బయటకు వచ్చి పంటపొలాల్లో కనువిందు చేస్తున్నాయి. ఆరుద్రకార్తెలో ప్రత్యేకంగా కనిపించే ఈ పురుగులు ఆదివారం నవీపేట లోని ఓ పొలంలో దర్శనమిచ్చాయి. ఆరుద్రకార్తెలో ఇవి కనిపిస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతుల విశ్వాసం.

- జిల్లాలో ఇప్పటి వరకు కురిసిన 93.7 మి.మీ వర్షం
- పంటల సాగుపై దృష్టిపెట్టిన రైతులు
- బోధన్ డివిజన్‌లో ఇప్పటికే మొదలైన వరిసాగు
- జిల్లా వ్యాప్తంగా ఆరుతడి పంటలతో పాటు వరిసాగు కొనసాగింపు
- ఇప్పటి వరకు లక్షా 30వేల ఎకరాలకు పైగా పంటల సాగు
- వరికే మొగ్గు చూపుతున్న రైతులు





• ముదక్‌పల్లిలో పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు

జిల్లాలో మోస్తరు వర్షాలు

నిజామాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటలపై దృష్టి పెట్టారు. నైరుతి రుతు పవనాల ప్రభావంతో కొద్దిపాటి వర్షాలు పడుతుండటంతో పనుల్లో నిమగ్నమయ్యారు. ఆరుతడి పంటలు మొక్కజొన్న, పసుపు, సోయా, కందులు, పెసర, మినుములతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వరి పంట సాగుకు సిద్ధమవుతున్నారు. భూగర్భ జలాలు ఉన్నచోట ఇప్పటికే బోధన్ డివిజన్‌లో రైతులు వరిసాగు కొనసాగిస్తున్నారు. నిజాంసాగర్ నీటిని కూడా విడుదల చేయడంతో ఎక్కువ మొత్తంలో వర్షాలకు అనుగుణంగా వరిసాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. నాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నారుమల్లు మొదట సిద్ధం చేసిన రైతులు నాట్లు వేసేందుకు దుక్కులను సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో రైతులు పూర్తిస్థాయిలో పనుల్లో నిమగ్నమయ్యారు.

మూడు రోజులుగా వానలు

జిల్లాలో మూడు రోజులుగా పలు మండలాల పరిధిలో వర్షాలు పడుతున్నాయి. జూన్ ఆరంభం నుంచే వానాకాలం మొదలు కాగా పది రోజుల పాటు ఎలాంటి వర్షాలు పడకపోవడంతో రైతులు కూడా పంటలను వేయలేదు. కేవలం భూగర్భ జలాలు ఎక్కువగా ఉన్న బోర్ల కింద మాత్రమే కొంత మేర పంటలను వేశారు. గడిచిన పది రోజులుగా జిల్లాలో జల్లులతో పాటు ఓ మోస్తరుగా వర్షం పడుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 114.1 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా, 93.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో ఆదివారం 13.1 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా నవీపేట మండలంలో 83.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. ధర్పల్లి మండలం మాత్రం అత్యధికంగా జల్లులు కురిసాయి. జిల్లాలో 33 మండలాలు ఉండగా 20 మండలాల్లో సాధారణ సగటు వర్షపాతం నమోదైంది. మిగతా 13 మండలాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షం పడింది.


5లక్షల 52వేల ఎకరాల్లో పంటల సాగు అంచనా

జిల్లా వ్యాప్తంగా 5లక్షల 52వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. జిల్లా వానాకాలం వ్యవసాయ ప్రణాళికను తయారు చేశారు. దానికి అనుగుణంగానే పంటలు సాగు అవుతుందని అంచనా వేశారు. జిల్లాలో ఈ సంవత్సరం అత్యధికంగా 4లక్షల 30వేల ఎకరాలకు పైగా వరి సాగు అవుతుందని అంచనాకు వచ్చారు. ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం సన్నరకాల సాగును ప్రోత్సహించేందుకు క్వింటాలుకు 500 బోనస్ ప్రకటించడంతో రైతులు కూడా వాటివైపే మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల కంటే ఈ జిల్లాలోనే ఎక్కువగా సన్నాలను గత కొన్నేళ్లుగా రైతులు పండిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనతో ఈ వానాకాలంలో సాగయ్యే మొత్తం వరి విస్తీర్ణంలో 70 శాతానికి పైగా సన్నరకాలను సాగు చేస్తున్నారు. జిల్లాలో బోధన్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 30వేల ఎకరాలకు పైగా వరిపంటను సాగు చేశారు. బోర్ల కింద ఎక్కువగా ఈ పంటను వేస్తున్నారు. నిజాంసాగర్ నుంచి ఆదివారం నీటిని విడుదల చేయడంతో ఈ డివిజన్ పరిధిలో ఎక్కువ మొత్తంలో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నిజాంసాగర్ కింద లక్షా 30వేల ఎకరాల వరకు అలిసాగర్‌పై నీటిని అందించడనుండటంతో ముందుగానే నారుమల్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇతర మండలాల పరిధిలో మాత్రం వర్షాలను బట్టి నారుమల్లను సిద్ధం చేస్తున్నారు. భారీ వర్షాలు పడిన తర్వాత గుత్ప, అలిసాగర్, లక్ష్మి, కాకతీయ కాలువల ద్వారా నీటి విడుదల అయిన తర్వాత పంటలను వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో పంటల సాగు లక్షా 30వేల ఎకరాల విస్తీర్ణం పైగా జరిగినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలను బట్టి తెలుస్తోంది. ఈ నెలాఖరులోపు ఎక్కువ మొత్తంలో సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తిస్థాయిలో వర్షాలు పడితే పంటల సాగు భారీగా పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. వర్షాలకు అనుగుణంగా పంటల సాగును కొనసాగించాలని ఆయన కోరారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

• ప్రాజెక్టులోకి ఇప్పటి వరకు 2.397 టీఎంసీలు రాక

నిజామాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద కొనసాగుతోంది. ఎస్సారెస్పీ పరీవాహక ప్రాంతంతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో ఈ వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 3472 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1058.10 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.86 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి జూన్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు 2.397 టీఎంసీల నీరు వచ్చి చేరింది. జిల్లాతో పాటు నిర్మల్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ఈ వరద వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. వర్షాలు మరింత పెరిగితే ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



టీయూలో ఎన్డీఏ, ఎన్టీఏల దిష్టిబొమ్మ దహనం



• దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

డిచ్‌పల్లి, జూన్ 23: తెలంగాణ విశ్వవిద్యాలయం మెయిన్ గేట్ ఎదుట ఆదివారం ఎన్ఎస్‌యూఐ నాయులు ఎన్డీఏ ప్రభుత్వంతో పాటు ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్డీఏ, ఎన్టీఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని, పేపర్ లీక్‌కు కారకులైన వారిని వెంటనే శిక్షించాలన్నారు. ఘటనపై సుప్రీం కోర్టులో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సాగర్ నాయక్, స్వామి, వేణు రాజు, వర్సిటీ ప్రతినిధులు ఆశిశ్, రాజేందర్, శ్రీనురాథోడ్, నవీన్, మహేశ్, అనిల్ పాల్గొన్నారు.



పోలీసు శాఖలో బదిలీలపై అధికారుల నజర్

- నచ్చిన పోలీసు స్టేషన్‌కు వెళ్లేందుకు అధికారుల ప్రయత్నాలు
- అధికార పార్టీ నేతల ద్వారా జోరుగా పైరవీలు
- త్వరలో పెద్దఎత్తున బదిలీలకు సిద్ధమవుతున్న అధికారులు

నిజామాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం శాఖల వారీగా బదిలీలకు సిద్ధం కావడంతో జిల్లా పోలీసు శాఖలో అధికారులు బదిలీలపై నజర్ పెట్టారు. ముఖ్యమైన పోలీసుస్టేషన్లకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదాయం వచ్చే పోలీసు స్టేషన్లపై దృష్టి పెట్టి అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. త్వరలో పెద్దఎత్తున బదిలీలు కానుండటంతో ముందస్తుగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కొందరు మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తూ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. సిఫారసు లేఖలను తీసుకుంటూ మల్టీ జోన్-1 పరిధిలో జరిగే బదిలీల్లో తమకు అనుకూలమైన స్థానాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో జిల్లాలో పనిచేసి ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు వెళ్లిన వారు కూడా జిల్లాకు వచ్చేందుకు పోటీ పడుతున్నారు. ఏళ్లతరబడి తమకు అధికార పార్టీ నేతలతో ఉన్న పరిచయాలను అడ్డం పెట్టుకొని జిల్లాకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.


అనుకూలమైన అధికారులపై నేతల చూపు

జిల్లాలో కీలకమైన పోలీస్ స్టేషన్‌లో తమకు అనుకూలమైన అధికారులను కూడా నియమించుకునేందుకు కొంత మంది అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. సిఫారసు లేఖలను ఇస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడుతూ జిల్లాకు వచ్చే విధంగా చూసుకుంటున్నారు. భవిష్యత్తులో అభివృద్ధి పనులతో పాటు ఇతర సమస్యలకు పోలీస్ శాఖ కీలకం కావడంతో అనుకూలమైన వారిని తెచ్చుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

బదిలీలకు సన్నద్ధం

ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసింది. ఏసీపీలు, డీఎస్పీలు, ఎస్సై, సీఐల బదిలీలను చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే కొంత మంది ఎస్సై, సీఐలను మల్టీ జోన్ పరిధిలో రోజుకు కొందిమంది చొప్పున బదిలీలను చేస్తున్నారు. ఎన్నికల్లో బదిలీలపై జోన్ పరిధిలోని ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులతో పాటు మల్టీజోన్ పరిధిలో వెళ్లిన అధికారులను బదిలీలు చేయనున్నారు. జిల్లాలో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, సబ్‌డివిజన్‌లు కమిషనరేట్ పరిధిలో ఉన్నాయి. వీటిలో ప్రధానంగా కేసులు, రియల్ ఎస్టేట్, వ్యాపార సముదాయాలు, అంతర్రాష్ట్ర సరిహద్దు స్టేషన్లు ఉన్నాయి. వీటిపై నజర్ పెట్టిన కొంత మంది అధికారులు ఈ స్టేషన్లకు వచ్చేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. ఎన్నికల సమయంలో జిల్లా నుంచి ఎస్సైలు, జోన్ పరిధిలో సీఐలు, మల్టీజోన్ పరిధిలో ఏసీపీలు రాష్ట్రస్థాయిలో బదిలీలు కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఏళ్ల తరబడి జిల్లాలో ఎస్సైలుగా పనిచేసిన వారు సీఐలుగా పదోన్నతి పొందారు. సీఐలుగా పని చేసిన వారు డీఎస్పీలుగా పదోన్నతులు వచ్చాయి. ఎస్సైలుగా కొన్నేళ్ల పాటు పనిచేసిన వారు ఎన్నికల సమయంలో జోన్ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లా పరిధిలోకి వెళ్లారు. వీరంతా ఈ బదిలీలను ఉపయోగించుకొని జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలను కలుస్తూ తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.





జంప్ జిలానీలు

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు
- పోచారం వెంటే కాంగ్రెస్‌లో చేరుతున్న ఆయన అనుచరులు
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ మారుతున్న నేతలు
- బీఆర్ఎస్ క్యాడర్‌ను కాపాడుకునేందుకు పార్టీ పెద్దల ప్రయత్నాలు

నిజామాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు ఆగడం లేదు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంటే నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలు కదులుతున్నారు. ఆయన వెంటనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు మండలాల వారీగా ప్రకటిస్తున్నారు. పెద్ద ఎత్తున చేరేందుకు సిద్ధమవుతున్నారు. బాన్సువాడ నియోజకవర్గం నుంచే కాకుండా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇతర నియోజకవర్గాల నుంచి కూడా మరి కొంత మంది నేతలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేరేందుకు సిద్ధమవుతుండటంతో బీఆర్ఎస్ నేతలకు షాక్ తప్పడం లేదు. పెద్ద ఎత్తున గ్రామ, మండల స్థాయి నేతలు వలస వెళ్తుండటంతో ఉన్న వారితోనే కార్యక్రమాలను కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు కొంత మేర క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. పెద్ద ఎత్తున ఎమ్మెల్యేలతో పాటు నేతలు పార్టీ వీడటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో మాత్రం ఆందోళన కొనసాగుతోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పట్టించుకునేవారు లేకపోవడంతో ఇతర క్యాడర్ కూడా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

పోచారం వెంటే ఆయన అనుచరులు

బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వ పనితీరు చూసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆయన చేరిక వెంటనే శనివారం బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆయన అనుచర కార్యకర్తలు ఆయన వెంటే నడుస్తున్నట్లు మండల వారీగా సమావేశాలు పెట్టి ప్రకటించారు. బీఆర్ఎస్‌కు అండగా ఉన్న ఎమ్మెల్యే పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడంతో తాము కూడా ఆయన వెంటే చేరుతున్నట్లు ప్రకటించారు. శాసనసభ ఎన్నికల తర్వాత మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కొంత మంది బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నేతలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. మిగతా వారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంట ఉండగా ఆయన పార్టీని వీడటంతో వారు కూడా చేరేందుకు సిద్ధమయ్యారు. ఏళ్లతరబడి ఆయన వెంట ఉండటంతో పాటు పలు పనులు చేపట్టడంతో పాటు మండల స్థాయిలో పదవులను అనుభవించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులతో పాటు, మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లుగా ఇతర పదవుల్లోనూ ఆయన అనుచర వర్గం కొనసాగింది. ఏళ్ల తరబడి వెంట ఉన్న వారు ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉండలేక ఆయన వెంటనే వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మూకుమ్మడిగా ప్రకటనలు చేశారు. ఎమ్మెల్యే మారడం వల్ల అభివృద్ధి పనులు మళ్లీ యథావిధిగా జరగనుండటంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. పోచారం ఆధ్వర్యంలో నియోజకవర్గానికి ఎక్కువగా నిధులు రావడం, గతంలో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండటం, ప్రస్తుతం అధికార పార్టీలో చేరడం వల్ల త్వరగా రిలీజ్ అయ్యే అవకాశం ఉండటంతో నేతలందరూ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉండే అవకాశాలు ఉన్నందున వచ్చే నెలలో పదవీ కాలం పూర్తవుతున్నందున జడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు ఇప్పటికే పదవీకాలం పూర్తయిన మాజీ సర్పంచులు ఎక్కువ మొత్తంలో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరికొంత మంది బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

క్యాడర్‌ను కాపాడుకునేందుకు నేతల ప్రయత్నాలు

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన అనుచరులు కూడా క్రమంగా పార్టీని వీడుతున్నారు. క్రమంగా బీఆర్ఎస్‌కు చెందిన నేతల్లో ఆందోళన కొనసాగుతోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ మారుతుండటంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు.. ఉన్న క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు తమ వెంట ఉన్న క్యాడర్‌తో మాట్లాడుతూ పార్టీ మారవద్దని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో బీఆర్ఎస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉండగా ప్రస్తుతం ఒకరు పార్టీ మారడం వల్ల ప్రశాంత్‌రెడ్డి మాత్రమే మిగిలి ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్‌గుప్త, జీవన్‌రెడ్డి, షకీల్‌లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరికను ఖండించారు.

ఆరేళ్లుగా నిలిచిన పాఠశాల పనులకు మోక్షం!

● ఎట్టకేలకు ఎస్టీ గురుకుల పాఠశాల నిర్మాణం పనులు పునఃప్రారంభం



మొదలైన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు

నాగిరెడ్డిపేట, జూన్ 23: మండలానికి మంజూరైన గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణం పనులకు మోక్షం లభించింది. సుమారు గత ఆరేళ్లుగా వివిధ అడ్డంకుల కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణ పనులు, అడ్డంకులు తొలగిపోవడంతో ఇటీవలే నిర్మాణం పనులు తిరిగి పునఃప్రారంభమయ్యాయి. నాగిరెడ్డిపేట మండలానికి 2016లో గిరిజన గురుకుల బాలుర పాఠశాల మంజూరైంది. పాఠశాల మంజూరు అయినప్పుడు మండల కేంద్రంలోని ఓ అద్దె భవనంలో పాఠశాలను తాత్కాలికంగా ప్రారంభించి కొనసాగించారు. 2017లో ఈ పాఠశాలకు నాలుగు కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం సొంతభవనాన్ని మంజూరు చేసింది. పాఠశాల భవన నిర్మాణం కోసం మండల కేంద్రంలో హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారి పక్కన 509 సర్వే నెంబర్‌లో 7 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. కాగా పాఠశాల నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ భూమి అంతకు ముందు ఓ రైతుకు ప్రభుత్వం కేటాయించింది. దీంతో సదరు రైతు ఇట్టి భూమి విషయంలో కోర్టును ఆశ్రయించడంలో స్థల వివాదం కారణంగా పాఠశాల నిర్మాణం పనులు ప్రారంభ దశలోనే పిల్లర్ల వరకు కొంత పనులు జరిగి నిలిచి పోయాయి. స్థల వివాదం తొలగిపోవడంతో పాఠశాల నిర్మాణం పనులు తిరిగి ప్రారంభం కాగా మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ మీదుగా రుద్రూరు వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి జాతీయరహదారిగా మంజూరు చేసింది. దీంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు రహదారి విస్తరణ కోసం సర్వే పనులు జరిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రస్తుతం నిర్మిస్తున్న పాఠశాల భవనం వరకు రోడ్డు విస్తరణ జరుగుతుందనే కారణంగా పాఠశాల నిర్మాణం పనులకు మళ్ళీ రెండోసారి బ్రేక్ పడింది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయకుండానే చేతులెత్తేశాడు. పాఠశాల భవన నిర్మాణం పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఫిబ్రవరి మాసంలో తిరిగి టెండర్లు నిర్వహించింది. నిర్మల్‌కుచెందిన ధరణి కన్‌స్ట్రక్షన్ టెండర్ తీసుకుని ఇటీవలే పాఠశాల నిర్మాణం పనులను చేపట్టారు. ఏళ్ళ తరబడి పాఠశాల నిర్మాణం పనులు వివిధ అడ్డంకుల కారణంగా ముందుకు సాగకపోగా, ప్రస్తుతం పనులను తీసుకున్న నూతన కాంట్రాక్టర్ త్వరగా పాఠశాల నిర్మాణం పనులను పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● నాలుగేళ్లుగా సరంపల్లిలో కొనసాగుతున్న పాఠశాల

నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఎస్టీ గురుకుల పాఠశాల ప్రస్తుతం కామారెడ్డి పట్టణానికి సమీపంలోని సరంపల్లిలోని ఓ అద్దె భవనంలో నాలుగేళ్ళుగా కొనసాగుతోంది. పాఠశాలకు సొంత భవనం లేక మొదట్లో మండల కేంద్రంలోని ఓ అద్దె భవనంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. అద్దె భవనంలో సరైన వసతులు లేకపోవడంతో పాఠశాలను మండల కేంద్రం నుంచి మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలోని ఓ రేకుల షెడ్డులోనికి మార్చారు. అక్కడ సుమారు ఏడాది పాటు పాఠశాలను నిర్వహించారు. అక్కడ కూడా విద్యార్థులకు సరైన వసతులు లేని కారణంగా మండలంలో గురుకుల పాఠశాలకు అవసరమైన అన్ని వసతులతో కూడిన అద్దెభవనం లభించకపోవడంతో అధికారులు ఈ పాఠశాలను కామారెడ్డి పట్టణానికి సమీపంలోని సరంపల్లిలోని ఓ అద్దె భవనంలోకి మార్చారు. సుమారు నాలుగేళ్ళుగా ఈ పాఠశాల సారంపల్లిలోని అద్దె భవనంలోనే కొనసాగుతోంది. మండలానికి చెందిన ఈగురుకుల పాఠశాల కామారెడ్డి జిల్లాకేంద్రం సమీపంలో కొనసాగుతుండటంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ గురుకుల పాఠశాల భవననిర్మాణ పనులు పునఃప్రారంభమైనందున సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులను వేగవంతంగా జరిపేలా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ త్వరగా నిర్మాణం పనులు పూర్తిచేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మండలవాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలపై సీఎంను కలిసిన భిక్కనూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం



రాజగంగారెడ్డి సీఎంను సన్మానిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్23: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, భిక్కనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజగంగారెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకరంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యా వ్యవస్థ మరింత మెరుగు పర్చాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని సీఎంకు తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో విన్నవించడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

భిక్కనూరు, జూన్23: మండలకేంద్రంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తాలో శ్యామాప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్యామాప్రసాద్‌ముఖర్జీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

భక్తి శ్రద్ధలతో నల్లపోచమ్మ పండుగ



నల్ల పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

మద్నూర్, జూన్ 23: మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నల్ల పోచమ్మపండుగను జరుపుకున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో రైతులు గ్రామస్తులు సామూహికంగా నల్లపోచమ్మ పండుగను జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆదివారం ఆయా కులసంఘాల ఆధ్వర్యంలో నల్లపోచమ్మ పండుగను జరుపుకున్నారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మేకలను బలిఇచ్చారు. కేంద్రంలోని ఆయా కులసంఘాల వారు భాజా భజం త్రీలతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తమ పాడి పంటలు బాగుండాలని మంచి వర్షం పాడి పంటలు బాగా పండాలని రైతులు తల్లిని వేడుకు న్నట్లు రైతులు తెలిపారు. అనవాయితీగా ప్రతీ ఏడాది పండుగ సందర్భంగానే నల్ల పోచమ్మ పండుగ జరుపుకుంటారు. ఈఏడాది వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో ముందు గానే పండుగను జరుపుకున్నట్లు రైతులు తెలిపారు.

ఆగని అడవి ఆక్రమణ

● ప్రతీ ఏటా పెరుగుతున్న అటవీభూమిసాగు
● దాడుల భయంతో అటువైపు వెళ్లని అటవీ అధికారులు

గాంధారి,జూన్ 22:పచ్చనిచెట్లు ప్రగతికి మెట్లు ఇది అటవీశాఖ నినాదం అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. అడవుల నిర్మూలన వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షాలు సకాలంలో పడడం లేదు. ఫలితంగా కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పోడు సాగుతో అసలు సాగు జరగని పరిస్థితి నెలకొంది.

● జోరుగా సాగు

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా అటవీ విస్తీర్ణం గాంధారి రేంజ్ పరిధిలోఉంది.అయితే గిరిజన తండాలు అత్యధికంగా ఉండడంతో ప్రతీ ఏటా అటవీ భూమి ఆక్రమణకు గురవుతుంది.ఇప్పటికే సుమారు 70శాతంకు పైగా భూమి ఆక్రమణకు గురైంది. ఈపరిస్థితులు ప్రతీఏటా పె రుగుతూనే ఉంది.ఈసంవత్సరం గతంలో సాగుచేసిన అటవీ భూమితో పాటు కొత్తగా అటవీభూమిని చాలాచోట్ల చెట్లను నరికి చదును చేసి సాగు చేస్తున్నారు. ఫలితంగా మండలంలో విస్తీర్ణం తగ్గిపోతుంది.

● అటవీభూమి కోసం తగాదాలు

ఇటీవల మండలంలో అటవీభూమి కోసం రెండు గ్రామాల ప్రజలు తరచుగా తగదాలు చేసుకుంటున్నారు. తామే అని సోమారం తండా, దుర్గం గ్రామాల ప్రజలు గొడవలకు దిగారు. యధేచ్ఛగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో దున్నుతూ చెట్లను మిషన్లతో నరుకుతూ సాగుకు పాల్పడ్డారు. అయిన అటవీ అధికారులు ఏమి చేయలేకపోయారు.

● పోడు పట్టాలతో పెరిగిన ఆక్రమణ

గత ప్రభుత్వం ఇష్టానుసారంగా పోడుపట్టాలను భారీగా ఇవ్వడంతో ఈ సారి అటవీ ఆక్రమణ మరింత పెరిగింది. పోడు పట్టాలు ఇవ్వడంతో



గాంధారి సమీపంలో అటవీభూమిని దున్నిసాగు చేసుకుంటున్న దృశ్యం



అడవి సంపదను నరికి వేస్తున్న దృశ్యం

నిబంధనలు పాటించకపోవడంతో అనర్హులు కూడా పట్టాలు పొందారు. పోడు పట్టాలను ఆసరాగా చేసుకుని మరింత అటవీభూమిని దర్జాగా దున్నుతున్నారు.కొందు దున్నుతేనే పోడుపట్టాలు ఇస్తారనే ఆశతో అటవీ భూమిని సాగుచేస్తున్నారు. పెద్దపెద్ద టేకు వృక్షాలను కూడా నరికి యధేచ్ఛగా సాగుకు పాల్పడితే ఆటగా అధికారులు చూసిచూడనట్లు ఉండడమే అటవీ ఆక్రమణకు ముఖ్యకారణంగా కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

'ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలి'

పెద్దబజార్,జూన్ 23: కూలి పెంచాలి,భూమి పంచాలి, వ్యవసాయ కూలీలకు, పేదలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఓఫంక్షన్‌హాల్‌లో జరిగిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా హాజరై కార్మికులనుద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు కనీస కూలీ రూ600 నిర్ణయించాలని, ప్రభుత్వం మిగులు భూములను పేదలకు పంచాలని అప్పుడే పేదలు వ్యవసాయ కూలీల బతుకులు బాగుపడతాయని అన్నారు.ప్రధానంగా పేద మహిళలందరికి నెలకు రూ.2500 జీవనభృతిని చెల్లిస్తామని, అర్హులైన నిరుపేదలందరికి రూ.4వేల పెన్షన్ చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఇప్పటికే రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షలరుణాలను చేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. రైతుభరోసాను అమలు పర్చడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కూలీలకు ఇచ్చిన హామీలను సంవత్సరానికి రూ.12వేల వెంటనే అమలు జరపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంలో ఉన్నటువంటి నరేంద్రమోదీ ప్రభుత్వం గతంలో వ్యవసాయ చట్టాలను మార్చి రైతులకు, పేదలకు నష్టం కలిగించే చర్యలు చేపట్టిందని అన్నారు. గతఎన్నికల్లో బీజేపీకి తాను నిర్దేశించుకున్న లక్ష్యానికన్న తక్కువ సీట్లను ప్రజలు ఇవ్వడం జరిగిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా పేదల సమస్యలు పట్టించుకోవాలని అర్హులైన పేదలందరికి స్థలాలను ఇచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షల రూపాయలు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగ య్య, కార్యదర్శి వెంకట్రాములు, ఉపాధ్యక్షుడు బుర్రిప్రసాద్, జిల్లా కార్యదర్శి పెద్దివెంకట్రాము లు, అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, సీఐటీయూ నాయకులు చందర్‌గౌడ్, నూర్జహాన్, గంగాధరప్ప, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

సిరికొండలో ప్రభుత్వ అతిథి గృహానికి
కేటాయించిన స్థలం కబ్జా



గెస్ట్‌హౌస్ నిర్మాణ స్థలంలో మోరం పోసి ఆక్రమించుకున్న దృశ్యం

సిరికొండ జూన్ 23 : జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరాన గల సిరికొండ లో ప్రభుత్వ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని గ్రామానికి చెందిన ఒకరు ఇది నాదే స్థలమని మొరం పోసి ఆక్రమించుకున్నారు. అయిన రెవెన్యూ,పంచాయతీరాజ్,పోలీస్ అధికారులు గాని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కిమ్మనకుండా మిన్న కుండిపోయారు అనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. 2023 సెప్టెంబరు 13న ఆనాటి ఎమ్మెల్యే తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ 40 లక్షలో నిర్మించే ప్రభుత్వ అతిథి గృహానికి శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అతిథి గృహానికి కేటాయించిన స్థలాన్ని నాది అని గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకోవడం చర్చానీయాంశంగా మారింది. సిరికొండ నడిబొడ్డున పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా , కామారెడ్డి-భీమ్‌గల్ వెళ్లె ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న ఈ భూమి ప్రస్తుతంగా ధర వేలల్లో పలుకుతుంది. భూఆక్రమణకు పాల్పడిన వ్యక్తి పేరున పట్టాదారు పాస్ పుస్తకం ఉందని ఇదీ నాదే అంటూ స్థలంలో మొరం పోయడాన్ని పలువురు తప్పుబట్టుతున్నారు.ఎందుకంటే 2020-2021లో ఆనాడు ఆర్మూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన బాజిరెడ్డి గోవర్దన్ పోలీస్ స్టేషన్‌కు స్థల సేకరణలో భాగంగా ఈ భూమిని తీసుకుని డబ్బులను ఇప్పించారు. రోడ్డు ప్రక్కన గల భూమి కూడ పోలీస్ స్టేషన్‌కు ఇచ్చిన భూమిలో భాగమని స్థానికులు చెపుతున్నారు. ఒకవేల భూమికి సంబంధించిన పత్రాలుంటే ఎమ్మెల్యే హోదాలో బాజిరెడ్డి గోవర్దన్ శంఖుస్థాపన చేసిన రోజు ఎందుకు అడ్డుకోలేదని స్థానికులు కొందరు సదరు వ్యక్తిని ప్రశ్నిస్తున్నారు. వాస్తంగా నీదే స్థలమయితే ఇన్ని రోజులు ఎందుకు మౌనంగా ఉండి పోయావేమిటని యువకులు ప్రశ్నిస్తున్నారు. భూమి తనదే అని ఆక్రమించుకున్న వ్యక్తికి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులే మద్దతుగా నిలిచారని సమాచారం. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు మౌనం వీడక పోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.వాస్తవానికి అది ఇనాం భూమి.గుడిలో పూజలు చేసి పంటలు పండించుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన భూమి కావడం గమనార్హం. ఇనాం భూమి అయినప్పుడు ప్రభుత్వ అవసరాల కోసం తీసుకోవచ్చని అధికారులు చెపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే అతిథి గృహానికి కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. అయితే దానిని ఆనుకుని పాతదారి(రెవెన్యూ స్థలం ఉంది దానిని కూడ కబ్జా చేసుకోవాలనే దానితో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నాయకుల అండతో సదరు వ్యక్తి ఇలా చేస్తున్నట్లు సిరికొండలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

అది ప్రభుత్వ భూమే

తహసీల్దార్ అతిథి గృహానికి శంకుస్థాపన చేసిన భూమి ప్రభుత్వ భూమి అని సిరికొండ తహసల్దార్ రవీందర్ రావు అంగీకరించారు. పోలీస్ స్టేషన్‌కు ఇచ్చిన భూమిలో బాగంగా మిగిలిన భూమిని తెలుసని ఆయన అన్నారు. పౌరోహిత్యం చేసినందుకు పంట పండించుకోవాలని మాత్రమే ప్రభుత్వం ఆ భూమిని కేటాయించారని తనకున్న సమాచారం అని అన్నారు.మొరం పోసిన వ్యక్తి తనను సంప్రదిస్తే నీ వద్ద ఏమైన పత్రాలు, డాక్యుమెంట్లు ఉంటే తీసుకరా అని చెప్పానని అయిన ఆయన ఇంతవరకు నా వద్దకు రాలేదని తహసీల్దార్ చెప్పారు. ప్రభుత్వ భూమి అయితేనే ఆనాటి ఎమ్మెల్యే అతిథి గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తహసీల్దార్ చెప్పారు.

- రవీందర్ రావు,సిరికొండ తహసీల్దార్

'కామ్రేడ్ కృష్ణ వర్ధంతి సభను విజయవంతం చేయాలి'



అమీనాపూర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వేల్పూర్,జూన్23:మండలంలోని అమీనాపూర్‌లో డీవీ.కృష్ణ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రజాపంథ డివిజన్ నాయకులు రమేష్ మాట్లాడుతూ ఐదు దశబ్దాల పాటు విప్లవోద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన కామ్రెడ్ డివి.కృష్ణ రెండో వర్ధంతిని సభను విజయవంతం చేయాలని కోరారు. తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి నిజామాబాద్ జిల్లాలో విప్లవోద్యమానికి అడుగులు వేసిన దగ్గర నుంచి 22 జూన్ 2022 క్యాన్సర్‌తో తుది శ్వాస ఉద్యమం వైపు నిలబడి కృషి చేసిన ఆదర్శ కమ్యూనిస్టు విప్లవ యోధుడు కృష్ణ అన్నారు. సైందాతికథ రాజకీయ రంగాలన్నింటిని నిషితంగా పరిశీలన చేసి సరైన సిద్ధాంతం కోసం మొక్కవోని పోరాటం చేశారన్నారు. కృష్ణ తన విప్లవ జీవితంలో ప్రజాపంథ కోసం నిరంతరం పోరాడారన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో డివి.కృష్ణ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశామని, ఈనెల 26వ తేదీన ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కేంద్ర కమిటీ కార్యదర్శి ప్రదీప్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగరావు హాజరవుతారన్నారు. ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు కలిగోట రాజుగౌడ్, తలారి మల్లెన్న, ఆమోస్, సృజన్, జ్యోతి, ముత్తెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: డీవీ.కృష్ణ రెండో వర్ధంతిని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం పిలుపునిచ్చారు. ఆదివారం జక్రాన్‌పల్లిలో డివి.కృష్ణ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 26వ తేదీన డివి.కృష్ణ రెండో వర్ధంతి సభను నిర్వహిస్తున్నామని, ఈ వర్ధంతి సభకు ప్రతీఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలోసీపీఐ(ఎంఎల్),ఐఎఫ్‌టీయూ నాయకులు నజీర్, శ్రీనివాస్, అనిల్, లక్ష్మీ, నర్సయ్య, కార్మికులు లత, పద్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ రాష్ట్ర కార్యదర్శి కామ్రెడ్ డివి.కృష్ణవర్ధంతి సభ సందర్భంగా జూన్ 26న తేదీన నాల్కల్ రోడ్డు వద్ద స్థూపా ఆవిష్కరణను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మండల అధ్యక్షుడు సాయిరెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండలం నడ్కుడ గ్రామంలో డివి.కృష్ణ వర్ధంతి సభ వాల్‌పోస్టర్లను బీడీకార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో బీడీ కార్మికులు, తదితరులు ఉన్నారు.

మోపాల్:ఈనెల 26వ తేదీన డీవీకేఅన్న స్థూప ఆవిష్కరణ పోస్టర్లను మోపాల్ మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ నాయకులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రజాపంథ జిల్లా నాయకులు సాయాగౌడ్, దండుగంగమల్లు, గంగా రాం, మహేష్, వీరయ్య, తదితరులు ఉన్నారు.

సిరికొండ: విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి ప్రాణ త్యాగం చేసిన త్యాగధనుడు చంద్ర కృష్ణమూర్తి అని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ కొనియాడారు. సిరికొండ మండలం తూంపల్లి గ్రామంలో జరిగిన ప్రతిఘటనోద్యమ దళపతి చంద్ర కృష్ణమూర్తి ఆలియాస్ ఎల్లన్న వర్ధంతి సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. ఈ సమావేశంలో దామోదర్, రమేష్, సాయరెడ్డి, ఈ రమేష్‌కిషోర్, బాల్‌రెడ్డి,ఎర్రన్న,సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నవీపేట,జూన్23: నవీపేటలోని ప్రధాన రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి కోరారు. ఆదివారం ఆయన నవీపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవీపేట మీదుగా నిత్యం 40నుంచి 45వరకు వివిధ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. దీని ద్వారా తరుచుగా రైల్వే గేటు మూసి ఉంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిత్యం హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నిర్మల్ జిల్లా బాసరలో ఉన్న సరస్వతి దేవి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్తుంటారని ఇదే మార్గంలో తరుచుగా రైల్వే గేటు మూసి ఉంచడంతో ప్రతిసారి రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఈ విషయంపై నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్‌లోని మాధవనగర్, అర్సపల్లిలలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కృషి చేసి మంజూరు చేయించారని, అదే విధంగా నవీపేటలో సైతం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయిస్తూ నిధులు కేటాయించే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూరిబాబు, జనార్ధన్, జావీద్, సాయితేజ, ఒడ్డె రవి తదితరులున్నారు.



నవీపేటలో మాట్లాడుతున్న జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి

పోచారాన్ని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం శుభపరిణామం

వర్ని,జూన్23: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం శుభపరిణామం అని పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వర్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున పోచారం శ్రీనివాస్ రెడ్డిని తాము ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలు ఉన్నారని వారందరిని కలుపుకుని ముందుకు పోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ బాబా, సొసైటీ మాజీ చైర్మన్ నేమాని వీర్రాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాష్ట్ర మైనారిటీ నాయకులు అబ్దుల్ భారీ, మండల మైనారిటీ అధ్యక్షులు షంషోద్దీన్, తిప్పారం వెంకట్ గౌడ్, నాగేశ్వరరావు, గజ్జల సాయిలు, ప్రశాంత్, నారాగౌడ్, బంజ సాయిలు, లచ్చాగౌడ్, బషీర్, మొగులయ్య, అవేజ్, నర్సింలు, అనిల్, నిఖిల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మెండోరలో ఘనంగా పస్కరాజుల పండుగ



మెండోరలో పస్కారాజులకు పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్థులు

మెండోర, జూన్23: మండల కేంద్రంలో పస్కారాజుల పండగను ముదిరాజ్ కులస్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్థులు ఖరీఫ్‌సీజన్‌లో మొదటగా పస్కారాజుల పండగ చేసిన తర్వాతే గ్రా మంలో ఉన్న దేవతల పండగలు గ్రామస్థులు నిర్వహిస్తారు. ముదిరాజ్ కులస్థులు జీవనాధారం పండ్ల పెంపకంతో జీవనం సాగిస్తుండడంతో నాటి రాజులు ముదిరాజ్ కులస్థులే గ్రామంలో ఉన్న దేవతలకు పండ్లను సమర్పించే అనవాయితీ తీసుకున్నారు. అందులో భాగంగా ముదిరాజ కులస్థులు గ్రామంలో ఉన్న పస్కారాజులకు నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించు కున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నోట్ బుక్‌ల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, జూన్23: పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రీయ యువజన సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. క్షత్రీయ సమాజ్‌కు చెందిన విద్యార్థులకు ఉచిత నోట్‌పుస్తకాలను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రీయ యువజన సమాజ్ అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి నీరజ్, సభ్యులు, పాల్గొన్నారు.

రహదారిపై ఏర్పడ్డ గుంతను పూడ్చివేయాలి



నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

నవీపేట,జూన్23: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రహదారిపై ఏర్పడ్డ గుంతను వెంటనే పూడ్చి వేయాలని స్థానికులు కోరారు. నవీపేట నుండి రాంపూర్ వెళ్లే రహదారిపై పెద్ద సైజులో గుంత ఏర్పడడంతో వర్షపు నీటితో పాటు మురికి నీరు నిలిచి ఉంటుందని, దీంతో రోడ్డుపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. రహదారిపై నూతనంగా కల్వర్టు నిర్మించాలని వారు కోరారు.ఈ విషయంపై గ్రామ పంచాయతీ అధికారులతో పాటు ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైన వెంటనే రోడ్డుపై ఉన్నగుంతను పూడ్చి వేయడంతో పాటు త్వరలో నూతనంగా కల్వర్టును నిర్మించే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మోస్రాలో కాంగ్రెస్ నాయకుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

మోస్రా,జూన్23: మోస్రా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తోట రాజు తల్లి మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ బాధ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి తోట రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మోస్రా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు నందు పటేల్, ప్రతాప్ సింగ్, మేక వీర్రాజు, హరి నారాయణ, అశోక్, బొజ్జ శ్రీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం విగ్రహాల ఊరేగింపు

మోపాల్, జూన్ 23:మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవతలను వర్షాల కోసం ఊరేగింపు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలను ఊరిపొలిమెర నుండి ఆలయాల వరకు ఊరేగింపు నిర్వహించారు. గంగ నుండి తీసుకువచ్చిన నీటితో జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతుల, ప్రజలు గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి పెద్దలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

డొంకేశ్వర్, జూన్ 23: డొంకేశ్వర్ మండలం గాదేపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సింగిడి నర్సారెడ్డి రోజు ఇంటి నుంచి గేదెను మేతకు పంపించే క్రమంలో గ్రామంలో ఉన్న జంగం మోహన్ ఇంటి వద్ద 16కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ హెర్త్ వైరు తగిలి గేదే మృతి చెందింది. సుమారు రూ.లక్ష విలువ చేసే గేదేను కోల్పోయానని రైతు వాపోయాడు.

అప్పారావుకు నివాళులర్పించిన కళాపరిషత్ సభ్యులు

ఖిల్లా, జూన్ 23:పౌరాణిక రంగస్థలానికి సీవీ అప్పారావు ఎంతో కృషి చేశారని శ్రీపాద నాటక కళాపరిషత్ సభ్యులు అన్నారు. ఆయన ఆకస్మికంగా ఈనెల 19న మృతి చెందడం పట్ల ఆదివారం కార్యాలయంలో సంతాపం ప్రకటించారు. ఆయన జిల్లాకే కాదు ఇతర ప్రాంతాల్లో కూడా రంగస్థలంపై పేరు తీసుకువచ్చారని తెలిపా రు. ఈ సమావేశంలో శ్రీపాద కుమారశర్మ, స్నేహమయి ప్రకాశ్, రామసూర్య ప్రకాశ్‌రావు, సీతారామచంద్రమూర్తి, రాజ్‌కుమార్ సుబేదార్, వీపీ చందన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండితులు

డిచ్‌పల్లి,జూన్ 23: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ స్కూల్ అసిస్టెంట్ లుగా పదోన్నత కల్పించినందుకు ధన్యవాదలు తెలిపినట్లు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ల , ప్రధాన కార్యదర్శి క్రాంతి కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భాషా పండితులకు భవిష్యత్తులో పదోన్నతులు వచ్చేవి కావని రేవంత్ సర్కార్ తమకు పదోన్నతులు కల్పించడంపై ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు శర్మ, జమీల్, హమీద్ ఖాన్, పాల్గొన్నారు

టీయూలో విద్యార్థుల ఆందోళన

డిచ్‌పల్లి,జూన్ 23: హాస్టల్‌లో నాసిరకం భోజనం పెడుతున్నారని రాత్రి విద్యార్థులు ఆందోళనకు దిగారు. మినిమేకర్ కూరగాయాల్లో నీటి శాతమే అధికంగా ఉందని నాణ్యత పాటించడం లేదని విద్యార్థులు భోజనం చేయకుండా నిరసన తెలిపారు. వర్సిటీ అధికారులు వెంటనే మెస్ నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నృత్యకళాకారులకు నంది అవార్డులు

కమ్మర్‌పల్లి, జూన్ 23: మండల కేంద్రంలోని శ్రీసరమేశ్వర నృత్యకళానిలయంలో కూచిపుడి నృత్యకళాకారులను నందిఅవార్డు వరించాయి. హైదరాబాద్ తెలంగాణ సరస్వతి పరిషత్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన నృత్యపోటీల్లో పాల్గొన్న కమ్మర్‌పల్లి శ్రీసరమేశ్వర నృత్యకళానిలయం విద్యార్థినిలు విశాలినిగౌడ్, వి వాణి, బి శ్రీలాస్య, ఎస్ హసిని, ఎస్ అబిజ్ఞ, ఏ పూర్విత, ఎస్ వన్షిక, కే రిషిత పాల్గొనగా వారి అసమాన నృత్యప్రదర్శకు ఈ అవార్డులు లభించాయి. కూచిపుడి నాట్యగురువు గంటా శిరీషా రాజశేఖర్ వద్ద ఈ విద్యార్థులు తర్ఫీదు పొందుతున్నారు. వీరి ప్రతిభకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు తోపాటు నంది అవార్డులు కైవశం చేసుకునట్లు నాట్యాచార్యులు కూచిపుడి నాట్యగురువు గంటా శిరీషా రాజశేఖర్ తెలిపారు. తమ పిల్లకు నంది అవార్డులు వరించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆవార్డుల ప్రదానంలో తెలంగాణ సరస్వతి పరిషత్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమి ఆర్గనైజర్ బిందు లీమ, ముఖ్యఅతిదిగా డాక్టర్ వేను గోపాలచారి హాజరైనట్లు తెలిపారు.

ముళ్ల పొదలతో..మురికి కాలువ



పొదలతో నిండిన మురికి కాలువ

మోస్రా,జూన్23: మండల కేంద్రంలో గల కోళ్లఫారం వీధి అడవిని తలపిస్తున్న మురికి కాలువలు ఈ కాలనీ వాసులు గత కొన్ని నెలలుగా గ్రామపంచాయతీ అధికారుల చుట్టూ తిరిగి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఇప్పటికి మాకాలనీ మురికి కాలువలు శుభ్రపర్చడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. కాలువలు శుభ్రం చేయక కాలువల పక్కన చెట్లు పెరిగి అడవిని తలపిస్తోందన్నారు.ఈకాలనీలో ఎక్కువ చిన్నపిల్లలు ఉన్నారని, ఇక్కడ పాముల బెడద ఎక్కువ ఉందని వృద్ధులు,మహిళలు సైతం భయం గుప్పిట్లో బతుకుత న్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిపెట్టి శుభ్రత చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,జూన్23: పొతంగల్ మండల కేంద్రంలో శనివారం రాత్రి మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పొతంగల్ మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పొతంగల్ ఆర్ఐ సాయిలు వాహనాలను పట్టుకుని తమకు అప్పగించారన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

డొంకేశ్వర్, జూన్ 23: డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామంలోని ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల చోరీకి గురైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రైతుల పంటలకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ లేకుండా పోతుందని, అర్ధరాత్రి ఎవరు లేని సమయాన్ని గుర్తించి దుండగులు దొంగతనానికి పాల్పడుతున్నారు. లిఫ్ట్ చైర్మన్ తెలిపిన వివరాల ప్రకారం 315హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా ఉండగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి 16క్వింటాళ్ళ 80కిలోల బురువు గల ట్రాన్స్‌ఫార్మన్‌ను కిందపడేసి అందులో ఉన్న ఆయిల్ ఎత్తుకెళ్లారు. అందులో ఉన్న ఆల్యూమినియం వైరును ధ్వంసం చేసి 475లీటర్ల ఆయిల్‌ను గుర్తుతెలియని దుండుగులు చోరీ చేశారు. దీని విలువ సుమారు రూ.4లక్షల 50వేలు ఉంటుందని లిఫ్ట్ చైర్మ న్ బుర్రన్న తెలిపారు. కాగా ఈ ఘటనపై లిఫ్ట్ కమిటీ చైర్మన్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైర్మన్ సుంకరి రాజు, వైస్‌చైర్మన్ జనార్ధన్, బండారి రవి, పుల్క సురేష్, తదితరులు పరిశీలించారు.



దత్తాపూర్‌లో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన దృశ్యం

కళాశాల స్థల ఆక్రమణపై విచారణ జరపాలి



బోర్గాం సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న పిడిఎస్‌యు నాయకులు

మోపాల్, జూన్ 23:నగరంలోని బోర్గాం(పి) గ్రామ సమీపంలో ఉన్న చిట్టిమిల్ల హరిప్రసాద్ ఆర్యవైశ్య జూనియర్ కాలేజీ స్థల అక్రమ రిజిస్ట్రేషన్‌పై ప్రభుత్వం విచారణ జరిపించాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థలాన్ని పిడిఎస్‌యు నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజీ ఏర్పాటు కోసం 4 ఎకరాల 22 గుంటల భూమిని కొనుగోలు చేశారని 1994లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి కాలేజీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారని అన్నారు. కొంత మంది స్వార్థపరుల వల్ల ఇప్పటి వరకు నిర్మాణం పనులు జరగలేదన్నారు. కాలేజీ కోసం ఉన్న భూమి ఏమైందని ప్రశ్నించారు. కాలేజీ భూములు వ్యక్తుల పేర్ల మీద ఉన్నాయని అన్నారు. కాలేజీ పేరు మీద ఉన్న భూమి ఎక్కడపోయిందని వారు ప్రశ్నించారు. కాలేజీ భూమిపై అర్బన్ ఎమ్మెల్యే స్పందించాలన్నారు. ఏ ఆశయం కోసం శంకుస్థాపన చేశారో ఆ ఆశయ సాధన కోసం ఆర్యవైశ్య జూనియర్ కాలేజీను నిర్మించి జిల్లా విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గౌతంకుమార్, ఉపాధ్యక్షులు కార్తిక్, సహాయ కార్యదర్శి ప్రిన్స్, నాయకులు సాయినాథ్, రాజేష్, తదితరులు ఉన్నారు.

అవార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న లాల్‌సింగ్

నిజామాబాద్ అర్బన్, జూన్ 23:తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ ఫలితాల్లో కళాశాలల వారిగా ఉత్తమ ఫలితాలు సాధించిన వారు అకాడమి ఎక్స్‌లెన్స్ అవార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ రమావత్ లాల్‌సింగ్ కోరారు. ఆది వారం నగరంలోని టీవీయూవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అవార్డులతో పాటు సన్మానం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అవార్డు కొరకు విద్యార్థులు తమ మార్కుల మెమోతో పాటు ఫోటోలు పంపాలని కోరారు.టీవీయూవీ ఎక్స్‌లెన్స్‌అవార్డ్‌జిమెయిల్.కామ్‌కు లేదా 7013443741, 9948010110 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ అజయ్, నగర అధ్యక్షుడు సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ధర్పల్లి- యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ధర్పల్లి, జూన్ 23:మండలంలోని సల్పబండ తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన రామారావు మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. రామారావు మహారాజ్ విగ్రహాన్ని తండాలో గల జగదాంబ ఆలయంలో ప్రతిష్ఠించారు. తాండావాసులు విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రామారావు మహారాజ్ విగ్రహాన్ని ఎంపీ అర్వింద్ బహూకరించినట్లు గిరిజనులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకున్న జడ్పీచైర్మన్



పూజలు చేస్తున్న జడ్పీ చైర్మన్ దంపతులు

భిల్లా, జూన్ 23: మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లోని శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయాన్ని ఆదివారం జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

- అమరవీరుడు, సమున్నత సమైక్యత భారత్ కోసం పోరాటం చేసిన మహోన్నత దేశ భక్తుడు



చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం



పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దబజార్, జూన్ 23:ఒకే ప్రధాని ఒకే జెండా ఒకే చట్టం అనే నినాదంతో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి దేశం కోసం ప్రాణాలు అర్పించారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుర్తు చేశారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి చేసిన త్యాగం మరువలేనిదని ఆయన అన్నారు. విద్యావేత్త, ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ క్యాబినెట్‌లో భారతదేశం యొక్క మొదటి పరిశ్రమ, సరఫరా మంత్రిగా (ప్రస్తుతం వాణిజ్యం, పరిశ్రమల) పిలుస్తారని అన్నారు. నెహ్రూతో విభజించిన తర్వాత లియాఖత్ -నెహ్రూ ఒప్పందానికి వ్యతిరేకంగా నిరసిస్తూ ముఖర్జి నెహ్రూ మంత్రివర్గం నుంచి రాజీనామా చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా జాతీయ ఐక్యతకు ముప్పుగా భావించే ఆర్టికల్ 370ని ముఖర్జి తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. భారతీయ జనసంఘ్‌ను రద్దు చేయాలనే లక్ష్యంగా ఆయన పార్లమెంట్‌లోపల, వెలుపల దానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాలంరాజు, లక్ష్మీనారాయణ, శంకర్, పల్నాటి కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బలిదాన్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు లోక భూపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్‌లు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జనసంఘ్ పార్టీని స్థాపించి 370ఆర్టికల్, బెంగాల్‌ను పాకిస్థాన్‌లో కలపాలన్న కుట్రను వ్యతిరేకించిన వ్యక్తి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, సీనియర్ నాయకులు బోట్ల విజయ్, ఆకుల శ్రీనివాస్, ఆకుల రాజు, మందుల వీరభద్రి, పొల్కం వేణు, పులియుగంధర్, కలిగోట ప్రశాంత్, జాగిర్దార్ శ్రీనివాస్, ఆరే రాజేశ్వర్, కిరణ్, ఉదయ్‌గౌడ్, బాశెట్టి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమైక్యతకు, సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు, సమున్నత సమైక్యత భారత్ కోసం పోరాటం చేసిన మహోన్నత దేశ భక్తుడు శ్యాం ప్రసాద్ ముఖర్జి అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రుద్రూరు మండల బీజేపీ నాయకులు ఆలేపాటి హరికృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'బస్టాండ్‌లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి'



బస్టాండ్‌లో ప్రయాణీకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మద్నూర్, జూన్ 23 : పట్టణంలోని పాత బస్టాండ్‌లో పోలీసుల ఆధ్వ ర్యంలో ప్రయాణీకులకు దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఇటీవల దొంగతనాలు చేసేవారు మహిళలను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారని, బస్సుల్లో ఎక్కేటప్పుడు దిగేటప్పుడు చుట్టూపక్కల వారిని ప్రయాణికులు గమనించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటామని బస్టాండ్‌లో అనుమా నాస్పదంగా ఉన్న వ్యక్తులు గుర్తించినట్లయితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దుచేయాలని వారు సూచించారు. దొంగతనాలను నివారించడానికి తెలంగా ణ ప్రభుత్వం పోలీసులను అప్రమత్తం చేసిందని బస్టాండ్ లో ప్రయాణీకుల వద్ద దొంగతనాలు జరుగకుండా అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా బస్టాండ్‌లో మహిళలను టార్గెట్ చేసి దొంగత నాలకు పాల్ప డుతున్న వారిని ఇటీవల గుర్తించామని ప్రయాణీకుల దృష్టికి వచ్చినట్లయితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నవీపేటలో భారీ వర్షపాతం నమోదు

నవీపేట,జూన్23: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత 15రోజులుగా సరైన వర్షాలు లేకపోగా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం వాతావరణం పూర్తిగా చల్లబడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైతులు వానకాలం సీజన్ పనులను ప్రారంభించారు. మండలంలో 92మిల్లి మీటర్ల వర్షపాతం కురిసిందని అధికారులు తెలిపారు.

జిల్లా అంతటా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం



డిచ్‌పల్లిలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం



ఇందల్వాయి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



జాన్కంపేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సాటాపూర్‌లో..



సిరికొండలో..



మెండోరలో..



కమ్మర్‌పల్లిలో

ఆర్మూర్‌రూరల్, జూన్23: సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఆదివారం పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ మాట్లాడుతూ గతప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చినవంద రోజుల్లో గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ వస్తుందని, రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో జంబి హన్మాన్ ఆలయ కమిటీ చైర్మన్ గోర్త దేవేందర్,కాంగ్రెస్ నాయకులు కొంతం మురళీ, పండిత్ పవన్, బాల్‌రెడ్డి,అల్లకొండ హరిష్,అజ్జు, మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్రఅధ్యక్షుడు కొక్కెర భూమన్న, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయడానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం ముద్ర వేయడం పట్ల ఆదివారం వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జెమ్స్‌గంగారెడ్డి,శ్రీనివాస్, గంగారెడ్డి,వినోద్, కిశోర్‌గౌడ్, వినోద్,సత్యం, సౌడ జయరాజ్, నరేష్, సౌడ ప్రభుదాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ ఆదివారం రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సీహెచ్ రాములు, సాయిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధనుంజయ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కార్తీక్, సాయిబాబా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:రెండు లక్షల వరకు పంట రుణాల మాఫీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం రైతుల పాలిట ఒక వరంగా బావించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి అన్నారు. రైతులను రుణ విముక్తులను చేయయడానికి రెండు లక్షల వరకు పంట రుణాలను ఏక కాలంలో మాఫీ చేయాలి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఆదివారం సిరికొండలో రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసిన అనంతరం రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రన్న, గాదరి నర్సారెడ్డి, పిట్ల నర్సింగ్, ఆసీఫ్,జీవన్,బాకారం సంతోష్,దేగాం సాయన్న, భాస్కర్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: రైతుల కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే రేవంత్ అన్న తపనని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం ఒకే విడతలో రైతు రుణమాఫీ చరిత్రాత్మకం అని కాంగ్రెస్ పార్టీ మంల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, రాజేంధర్, గంగారెడ్డి, రమేష్, గంగయ్య, మోహన్, నరేష్, మౌలానా, అశోక్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండులక్షల రుణమాఫి చేస్తామని ప్రకటించడంతో ఆదివారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీమండల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, రుణమాఫీ చేస్తామంటూ నాన్చుడుధోరణి అవలంభించడంతో రైతులకు వడ్డీభారం పడిందని ఆరోపించారు.ఈ కార్యక్ర మంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు పడిగెల ప్రవీన్, తిప్పిరెడ్డి శ్రీనివాస్, తక్కూరి దేవేందర్, పాలెపు నర్సయ్య,బోనగిరి భాస్కర్, చాన్నోల్ల రెడ్డి, తదితర మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీని చేస్తున్నామని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకొని ప్రకటించడం పట్ల ఆదివారం జక్రాన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చిత్రపటాలకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, జక్రాన్‌పల్లి ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కాంగెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందల్వాయి:తెలంగాణ రాష్ట్ర రైతులకు 2లక్షల రుణమాఫీకి కేబినెట్ ఆమోదం తెలిపినందున ఆదివారం ఇందల్వాయి మండల కేంద్రంలో కిసాన్‌కేత్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, డీసీసీబీ డెలిగేట్ వెంకట్‌రెడ్డి, సుధాకర్, సంతోష్‌రెడ్డి, బుట్ట గంగాధర్, మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: రాష్ట్ర రైతులకు ఒకే విడతలో రూ.2లక్షల రుణా మాఫీ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం రైతులందరికి ఎంతో ప్రయోజనం చేకురిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ అన్నారు. ఆదివారం డిచ్‌పల్లి బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నోళ్ల నర్సయ్య, వైస్ ఎంపీపీ సాయిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శాంసన్, ధర్మగౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గెజిటెడ్ హెచ్‌ఎం సంఘం ప్రతినిధులు



సీఎంను కలిసిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 23: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యావ్యవస్థ పరిపాలనను మరింత మెరుగు పర్చాలని కోరుతూ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2016లో జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా విద్యాశాఖను పునర్‌వ్యవస్థీకరించకపోవడంతో పాఠశాల విద్యావ్యవస్థ పరిపాలన పూర్తిగా విధ్వంసానికి గురైందని రెవెన్యూ డివిజన్ల మాదిరి ఎడ్యుకేషన్ డివిజన్‌లను రీఆర్గనైజ్ చేయాలని రాష్ట్రంలో ఉన్న 615 మండలాలను ప్రతి నాలుగైదు మండలాలకొక విద్య డివిజన్‌గా పరిగణిస్తూ ప్రతి డివిజన్‌కొక డివిజనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టును మంజూరు చేసి పదోన్నతి ఇవ్వాలన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలపై ఒక మండల స్థాయి అధికార పోస్టును క్రియేట్ చేయాలని, గత 20ఏళ్లుగా ఖాళీగా ఉన్న విద్యాశాఖలోని వివిధ విభాగాలకు వెంటనే ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. గత 19 ఏళ్లుగా 16 మంది రెగ్యూలర్ ఎంఈవోలు ఒకేచోట పనిచేస్తున్నారని వారికి బదిలీలు నిర్వహించాలన్నారు. సీఎంను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , తదితరులు ఉన్నారు.

ఇండియా జోనల్ రీసెంట్‌గా డాక్టర్ శ్రీకాంత్

బోధన్‌రూరల్,జూన్23: బోధన్ పట్టణానికి చెందిన డాక్టర్ శ్రీకాంత్ దేశాయ్ ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ డెంటిస్ట్ అసోసియేషన్ ఫర్ సౌత్ జోన్ ఆఫ్ ఇండియాకు జోనల్ రీసెంట్‌గా నియామకం అయ్యాయి. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఐసీడీ సమావేశంలో బోధన్ పట్టణానికి చెందిన డెంటల్ డాక్టర్ శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు, ప్రముఖులు డాక్టర్ శ్రీకాంత్‌ను అభినందించారు